క్లుప్తంగా

అవార్డు ప్రదానం



కురవి: ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆగ్రో హోమియోపతి' గ్రంథానికి వచ్చిన అవార్డును కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన జంగం లోహిత్ శుక్రవారం న్యూఢిల్లీలోని యశోభూమి ద్వారకలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా అందుకున్నాడు.

ద్విచక్రవాహనాలు సీజ్



గూడూరు: ఎవరైనా ద్విచక్రవాహనాలకు నంబర్ ప్లేట్‌లు, అవసరమైన పత్రాలు లేకుండా తిరుగుతూ పట్టుబడితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని సీఐ కోట బాబూరావు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎస్పీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎలాంటి పత్రాలు, నంబర్లు లేకుండా కనిపించిన 20 ద్విచక్రవాహనాలను పట్టుకొని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సై సీహెచ్. నగేష్ పాల్గొన్నారు.

ఫార్మసిస్ట్స్ జిల్లా అధ్యక్షుడిగా తన్నీరు వేణు



పెద్దవంగర: ఫార్మసిస్ట్స్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెద్దవంగర మండలానికి చెందిన చిట్యాల గ్రామవాసి తన్నీరు వేణు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణగౌడ్ శుక్రవారం నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులకు వేణు కృతజ్ఞతలు తెలిపారు.

ద్విచక్రవాహనాల్లో పెట్రోల్ చోరీ



కురవి: మండల కేంద్రంలో ద్విచక్రవాహనాలను పార్కింగ్ చేసి ఉన్న చోట గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్‌ను చోరీకి పాల్పడుతున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. కురవి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు సమీపంలో ఓ ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనంలో కొందరు వ్యక్తులు పెట్రోల్ సప్లయ్ అయ్యే పైపును కట్ చేసి అందులో నుంచి పెట్రోల్‌ను చోరీ చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు రాత్రి గస్తీ ఏర్పాటు చేసి దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోరుతూ జిల్లా కేంద్రంలో శుక్రవారం గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడిజీ ఘణపురపు అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రచారంలో పార్టీ పథకాల గురించి అవి ఏ విధంగా ప్రజలకు పథకాలు ఉపయోగం అవుతున్నాయనే విషయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు నూనావత్ రాధా, టీపీసీసీ ఓబీసీ స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్ పిండ్రాల రాందాసు, జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ నాయక్, రియాజ్ అన్సారి, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వంశీ, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి, మండల మహిళ అధ్యక్షురాలు స్వర్ణలత పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం తప్పదు

డోర్నకల్: ప్రతిపక్ష పార్టీలను నిర్వీర్యం చేస్తూ అణిచివేత ధోరణి అవలంబిస్తున్న బీజేపీకి రాబోయే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. డోర్నకల్‌లో శుక్రవారం జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలతోపాటు నిరుద్యోగ సమస్య తీవ్రంగా పెరిగిందన్నారు. రాజ్యాంగ సంస్థలైన ఈడీ, సీబీఐ లాంటి సంస్థలను ఉపయోగించి ప్రతిపక్ష పార్టీ నేతలను జైళ్లకు పంపుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో ప్రభేష్, తురక రమేష్, జున్ను స్వామి, భూక్యా వాల్యా పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: తండా జీపీలు, గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో స్థానికులు ఐక్యంగా ఉండి పాల్గొంటూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ సూచించారు. మండలంలోని సోమ్లతండా గ్రామంలో పార్లమెంట్, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తలు, నాయకులు, ప్రజలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎలాంటి అభివృద్ధి పనులు జరిగినా సరే అందరూ కలిసికట్టుగా ఉంటూ అభివృద్ధి పనుల్లో పాల్గొనాలని తెలిపారు. ఎలాంటి విభేదాలు లేకుండా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు, ప్రజలు కష్టపడి పనిచేయాలని పేర్కొన్నారు. తాను సోమ్లాతండా బిడ్డగా చాలా గర్వపడుతున్నానని, రానున్న రోజుల్లో ఎలాంటి కష్టమైనా నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భూక్య రాంచందర్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

హోమియోపతి మందులతో వ్యాధులు దూరం



హోమియోపతి మందు వేస్తున్న ఎమ్మెల్యే

వ్యాధి మూలాన్ని గుర్తించేది హోమియోపతి వైద్యమని, సూక్ష్మమైన హోమియోపతి గుళికలతో అనితర సాధ్యమైన వ్యాధులు నయమవుతాయని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. వైద్య ప్రదాత డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న హోమియోపతి వారోత్సవాల్లో భాగంగా మహబూబాబాద్ మండలంలోని సోమ్ల తండా గ్రామంలో ఉచిత వడదెబ్బ నివారణ హోమియో వైద్యశిబిరం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి ఎమ్మెల్యే హాజరై మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పరికిపండ్ల అశోక్, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ, ఎంపీటీసీ భూక్య రామచందర్, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలాజీ, కాంగ్రెస్ నాయకులు లకావత్ పద్మ, భూక్యసూర్యం పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: మహనీయులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ వైద్యుడు నెహ్రూనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం బాబు జగ్జీవన్, జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతులను పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రాజ్‌కుమార్, సురేందర్‌నాయక్, ఉపాధ్యాయులు రామయ్య, ప్రభాకర్, వీరునాయక, రామచంద్రర్‌రావు, హల్యానాయక్, ఫిరోజ్, గణేష్, హరి, భిక్షపతి, ఉప్పలయ్య, భోజ్యానాయక్, భాస్కర్, నాగేశ్వర్‌రావు, రవీందర్‌రావు, లక్ష్మినారాయణ, వీరస్వామి, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బయ్యారం: మండలకేంద్రంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సుమన్ తెలిపారు. శుక్రవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటనను విడుదల చేశారు. 11కేవీ బయ్యారం ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు బయ్యారం, రంగాపురం, జగ్గుతండా హ్యాబిటేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

డోర్నకల్: డోర్నకల్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంతో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని డోర్నకల్, ఉయ్యాలవాడ, తహసీల్దార్ బంజర, అమ్మపాలెం, సీతారాంపురం, చాప్లాతండాలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు.

మరిపెడ/మరిపెడ రూరల్: మరిపెడ సబ్‌డివిజన్ పరిధిలోని మరిపెడ, ఉల్లెపల్లి, ఎల్లంపేట, చిన్నగూడూరు, పెద్దనాగారం, కౌసల్యదేవిపల్లి సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ అంతరాయం ఉదయం 8గంటల నుంచి 10.30గంటల వరకు ఉంటుందని సబ్‌డివిజన్ ఏడీఈ లోక్‌నాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

కేసు నమోదు

దంతాలపల్లి: మండలంలో 8 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకొని 150 లీటర్ల పానకం ధ్వంసం చేసి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు. పెద్దముప్పారం గ్రామంలో తనిఖీలు నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన కొండ వెంకన్న ఇంట్లో గుడుంబా స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నేడు బీజేపీ బూత్ స్థాయి సమ్మేళనం



చిన్నగూడూరు: సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్ నాయక్

చిన్నగూడూరు: జిల్లా కేంద్రంలో నేడు నిర్వహించే బీజేపీ బూత్ స్థాయి సమ్మేళనంను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు గుగులోత్ లక్ష్మణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి లక్ష్మణ్‌నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గంధసిరి మధు, నాయకులు నవీన్, వేణు, అశోక్, బాలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

మరిపెడ: జిల్లా కేంద్రంలో శనివారం జరిగే బూత్ స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కట్టోజు గంగాధర్ కోరారు. ఈమేరకు మరిపెడలోని పార్టీ కార్యాలయంలో మండల బూత్‌స్థాయి సన్నాహక సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో వెంకటరెడ్డి, బోడ రమేష్, బింగి రమేష్, సుధాకర్, మధు, సురేష్, పాల్గొన్నారు.

సమ్మేళనానికి హాజరుకావాలి

కేసముద్రం: పార్లమెంట్ బూత్ స్థాయి సమ్మేళనానికి హాజరుకావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రడం వెంకన్నగౌడ్ శుక్రవారం తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

గూడూరు: మండలంలోని అప్పరాజ్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతాలక్ష్మణహనుమత్ సమేత కోదండరామచంద్రస్వామి ఆలయంలో రెండో రోజు శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఉదయం ద్వారతోరణ పూజ, మూర్తికుంబ ఆరాధన, మూలమంత్ర హోమం, సాయంత్రం మూలమంత్ర ప్రాణప్రతిష్ఠ, హోమం, ఫల, పుష్ప, ధాన్య, శయ్యాధివాసాలు నిర్వహించారు. అనంతరం హారతి, తీర్థప్రసాదాలు అందించారు. ఈ ఆలయ నిర్మాణం కోసం దివంగత మాధవపెద్ది సోమనర్సింహారెడ్డి స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు 8 గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. గ్రామస్తులంతా ఏకమై ఆలయ నిర్మాణం కోసం సుమారు రూ.50లక్షల రూపంలో విరాళాలు సేకరించి, నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం చేశారు. మాజీ సర్పంచ్ మాధవపెద్ది విజయశ్రీ విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవపెద్ది గీత అమరేందర్‌రెడ్డి, గ్రామస్తులు భూక్య చందర్, మూడు వీరన్న, జయపాల్, సురేందర్, బింగి వెంకన్న, వేముల రవి, శ్రీకాంత్, ఆలయ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు పోగుచేసినట్లు తెలిపారు.

అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలి



మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నెహ్రూసెంటర్: ఆర్టీసీ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన పోరాటంలో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా సీపీఐ పోరాటం చేసిందని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. ఆర్టీసీ పరిరక్షణ ఉద్యమ కేసుల్లో భాగంగా కోర్టుకు హాజరై అంబేడ్కర్ సెంటర్‌లో శుక్రవారం మాట్లాడారు. ఆర్టీసీని పరిరక్షించాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ నేతలు పోరాటం చేస్తే 40 మంది నేతలపై అక్రమంగా కేసులు నమోదు పెట్టారని ఆరోపించారు. అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, నవీన్, వెంకన్న, సాంబలక్ష్మీ, శ్రావణ్, ఫాతిమా, పద్మ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలి



ఏడీఏ రమేష్‌నాయక్‌కు మొక్క అందిస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: ప్రపంచ స్థాయి పర్వతాలను అధిరోహించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యుత్ శాఖ కురవి శాఖ డివిజన్ ఏడీఏ ఆంగోతు రమేష్ నాయక్ అన్నారు. మండలంలోని భూక్య తండాకు చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ ఖమ్మంలోని ఏడీఏ నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా ఏడీఏకు మొక్క అందించి యశ్వంత్ శుభాకాంక్షలు తెలిపాడు. అనంతరం గతంలో యశ్వంత్ అధిరోహించిన పర్వత శ్రేణుల గురించి అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటాలని యశ్వంత్‌ను ఏడీఏ అభినందించారు.

తాగునీటికి రూ.30లక్షల మంజూరు

దంతాలపల్లి: మండలకేంద్రంతోపాటు మండల పరిధిలో గల గున్నెపల్లి, పాండ్యాతండా, దాట్ల, నిదానపురం, పెద్దముప్పారం, బీరిశెట్టిగూడెం, వాల్యతండాతోపాటు పలు గ్రామాలకు తాగునీటి కోసం ఎమ్మెల్యే రూ.30లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీటీసీ నెమ్మది యాకయ్య, నాయకుడు బాలాజీ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో బోరు వేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుస్మిత రవీందర్, మాజీ ఉపసర్పంచ్ బొల్లు శిరీష వీరన్న, నాయకులు కొమ్ము వాసు, ధర్మారపు వెంకన్న, బెల్లి సంపత్ పాల్గొన్నారు.

ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం



పార్టీ కార్యాలయం ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రావు

గూడూరు: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకుడు లింగాల సుధీర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల పార్టీకి కొత్తగా ఎన్నికైన అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ నూతన కార్యాలయాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నో సిద్ధాంత భావాలు కల్గిన బీజేపీ పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమికి ప్రధాని అభ్యర్థి కరువయ్యారన్నారు. కష్టపడే కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని, కార్యకర్తల త్యాగాల పునాదులపై నిలిచిన పార్టీ బీజేపీ అన్నారు. అదేవిధంగా శనివారం మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో జరిగే పోలింగ్ బూత్ విజయ సంకల్ప సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుండెబోయిన మల్లేష్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్, సీనియర్ నాయకులు పడాల నాగరాజు, బత్తుల లక్ష్మణ్‌యాదవ్, కోరె అనిల్‌యాదవ్, బండి వెంకన్న, సాయిబాబా పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



చిన్నగూడూరు: చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్సై



పెద్దవంగర: ఉప్పరగూడెంలో..

చిన్నగూడూరు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై ఝాన్సీ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని దాశరథి ప్రాంగణంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై ఝాన్సీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ యాకయ్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవంగర: మండలంలోని ఉప్పరగూడెంలో జనవికాస ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. గ్రామానికి చెందిన దాత వేముల వెంకన్న-సాంబలక్ష్మీ దంపతులు చలివేంద్రానికి తమవంతుగా సాయమందించారు. ఈ సందర్భంగా జనవికాస కోఆర్డినేటర్ శైలజ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుంపల కుమారస్వామి, వేముల భిక్షం, ప్రభాకర్, అశోక్, వెంకటేష్, కారోబార్ రవి, జనవికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి దాతలు చలివేంద్రం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం మండల జనవికాస మండల కోర్డినేటర్ గంధసిరి ఉపేంద్ర ప్రారంభించారు. కార్యక్రమంలో సహ కోఆర్డినేటర్ జుజ్జురి ఉపేంద్ర, ఉపేంద్ర, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈఓపై చర్య తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

తొర్రూరు: దళిత మహిళను లైంగికంగా వేధించిన పీఏసీఎస్ సీఈఓపై తక్షణమే చర్య తీసుకోవాలని జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ దళిత మహిళను వేధించడంతో ఈ నెల 4న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, ఎఫ్ఐఆర్ నమోదు చేసినా నేటికి అతనిని అరెస్టు చేయలేదన్నారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలన్నారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు నకిరెకంటి కొమురయ్య, తలారి అశోక్, రాయిశెట్టి వెంకన్న, వెంకటసాయిలు, సంజీవ, ఐలయ్య, నాగయ్య, ప్రసాద్, ఉపేందర్, యాకేందర్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పుస్తకాల పంపిణీ

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, డైరెక్టర్లు మాల్యా, వెంకట్‌రెడ్డిలు గ్రూప్ ఉద్యోగులకు పోటీ పడుతున్న మానుకోట జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాల విద్యార్థులకు పుస్తకాలను ఉచితంగా శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం పోటీ పరీక్షల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ జోలి సత్యనారాయణ, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు బద్రి, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో శుక్రవారం కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలో 250 మంది కంటి పరీక్షలు చేయగా 16 మంది విద్యార్థులకు కళ్లద్దాల కోసం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి సిఫారసు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆఫీసర్ సుబ్బలక్ష్మి, పాఠశాల జీఎస్ఎం ప్రమీల, ఏఎన్ఎం లావణ్య పాల్గొన్నారు.

'రాముడు ధర్మ స్వరూపం'

మహబూబాబాద్ రూరల్: రాముడు ధర్మ స్వరూపమని భద్రాచలంకు చెందిన ప్రవచకులు బొడ్డపాటి శ్రీరామ సుబ్రహ్మణ్యేశ్వరశర్మ (రామాయణ శర్మ) అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీరామ ఆలయంలో జరుగుతున్న సీతారామచంద్ర స్వామివారి కల్యాణ వసంత నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా 'శ్రీరామభక్తి' అంశంపై రామాయణ శర్మ ప్రవచనాలను వివరించారు.

రిజర్వేషన్ అమలు చేయాలి

డోర్నకల్: నాయకపోడు రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల బుచ్చయ్య కోరారు. మండలంలోని బూరుగుపాడు గ్రామంలో శుక్రవారం పర్యటించిన బుచ్చయ్య మాట్లాడుతూ.. నాయకపోడు గిరిజనులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని అన్నారు. వారి జీవనం మెరుగుపడటానికి ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శ్రీను, జిల్లా ప్రధాన కార్యదర్శి దబ్బా శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చిన్నగూడూరు: మండలంలోని గుండంరాజుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వరుడి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ రూ.50వేల విరాళం అందజేశారని గౌడ సంఘం ప్రతినిధులు గురువారం తెలిపారు. మంత్రికి సంఘం నాయకులు, గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు గునిగంటి కృష్ణ, చిర్ర రామన్న, కారుపోతుల శంకర్, గునిగంటి వెంకన్న పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి గ్రామ శివారు ప్రాంతాలు, తండాల సమీపంలో గుడుంబా తయారీ కేంద్రాలపై శుక్రవారం పోలీసులు దాడి చేసి 3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 5లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో రూరల్ ఎస్సై దీపికరెడ్డి, సిబ్బంది సోమమల్లు, విజయ్, రాందాస్ పాల్గొన్నారు.

గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో తాగుబోతు హంగామా

మహబూబాబాద్ రూరల్: గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో తాగుబోతు హంగామా చేసిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రయాణికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో గురువారం రాత్రి ఓ వ్యక్తి ఎక్కాడు. రైలు వరంగల్ నుంచి బయలుదేరిన కొంత సమయానికి టీసీ టికెట్ అడిగాడు. మద్యం తాగి సదరు వ్యక్తి టీసీతో వాగ్వివాదానికి దిగాడు. అంతేకాకుండా ఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌తో గొడవ పెట్టుకున్నాడు. అదే విధంగా ప్రయాణికులతో ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించి అసభ్యకర పదజాలంతో దూషించాడు. దీంతో అతడిని మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో దింపి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చి వెళ్లారు.

నివాళి

గార్ల: బుర్క పుల్లయ్య(55) అకాల మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఇటీవల వడదెబ్బకు గురై మృతిచెందిన పుల్లయ్య దశదిన కర్మలకు ఎమ్మెల్యే హాజరై నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, సైదయ్య పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు ముమ్మరం

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్లకు సంబంధించి మధ్య స్తంభాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం 500 విద్యుత్ స్తంభాలు మంజూరు కాగా పలు గ్రామాల వ్యవసాయ భూముల్లో ఇప్పటి వరకు 150 వరకు ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. త్వరలో కొన్ని ప్రాంతాల్లో సర్వే నిర్వహించి పూర్తి స్థాయిలో మధ్య స్తంభాలను ఏర్పాటు చేస్తామని విద్యుత్ శాఖ ఏఈ కిరణ్ తెలిపారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన పద్మశాలీలు

కేసముద్రం: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని శుక్రవారం హైదరాబాద్‌లో కేసముద్రం మండలానికి చెందిన పద్మశాలీ సంఘం నాయకులు కలిశారు. సంఘం భవన నిర్మాణానికి సహకారం అందించాలని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు సామల నర్సయ్య, ఉపాధ్యక్షుడు కాముని కుమారస్వామి, కోశాధికారి మామిడాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చిట్యాల వీరన్న పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



చిన్నగూడూరు: మండల కేంద్రం శివారు ఆకేరు బ్రిడ్జి సమీపంలో క్షుద్ర పూజల ఆనవాళ్లు స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్నగూడూరు మండల కేంద్రం ఆకేరు బ్రిడ్జి సమీపంలో మరిపెడ, నర్సింహులపేట వెళ్లే ప్రధాన రహదారుల మూలమలుపు వద్ద నిమ్మకాయలు, పసుపు, కుంకుమ ఆనవాళ్లు కనిపించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బలరాంనాయక్ గెలుపునకు కృషి చేయాలి

బయ్యారం: కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బలరాంనాయక్ గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పార్టీ అనుబంధ ఎస్టీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బానోత్ రామునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకట్రాంపురంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్నికల పేరుతో ప్రజల వద్దకు వస్తే 10 ఏళ్ల పాలనలో ఏం చేశారో నిలదీయాలన్నారు. నాయకులు అభి, రవీందర్, రవి, వెంకన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

దంతాలపల్లి: ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీయాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుండగాని భరత్ అన్నారు. శుక్రవారం కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిన్న మహేష్, శోభన్, రవి, నరేష్, సురేష్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.